

పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి 8లో..

కాంట్రాక్టు సిబ్బందికి రూ.30లక్షల ప్రమాద బీమా 8లో..

కేంద్ర బడ్జెట్‌పై పెదవి విరుపు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కేంద్ర బడ్జెట్‌పై వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పెదవి విరుస్తున్నారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినా కూడా కేంద్రం తెలంగాణ రాష్ట్రంపై దయ చూపలేదని, పదేళ్లుగా వివక్షను చూపుతూనే ఉందని, నేటికి కూడా విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చడం లేదని మండిపడుతున్నారు. వికసిత్ భారత్ అంటూ బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు లాభం చేకూర్చే విధంగా, ఐదేళ్ల తమ కుర్చీని కాపాడుకునే విధంగా బడ్జెట్ ఉందని ప్రతిపక్ష పార్టీల నేతలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 48.21 లక్షల కోట్ల రూపాయలతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచే దిశగా ప్రాధాన్యం కల్పించారు. పట్టణాభివృద్ధి, ఇంధన భద్రతకు పెద్దఎత్తున నిధులు కేటాయించారు. ముద్ర రుణాలను 10 లక్షల నుంచి 20లక్షలకు పెంచారు. పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే కార్మికుల కోసం అద్దె గృహాల నిర్మాణం చేపడుతామన్నారు. ప్రధాని ఆవాస్ యోజన కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 3 కోట్ల వరకు అదనంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతామని ప్రకటించారు. వచ్చే ఐదేళ్లలో అర్బన్‌హౌసింగ్‌కు 2.20 లక్షల కోట్లు వెచ్చిస్తామని పేర్కొన్నారు. రసాయనాలతో చేస్తున్న వ్యవసాయం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడడమే గాకుండా అన్ని విధాలా నష్టపోతున్న విషయం తెలిసిందే. దీనిని రూపు మాపేందుకు దేశంలో కొనసాగుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాస్తామని పేర్కొంది. రసాయనాలు ఉపయోగించకుండా పూర్తిగా సేంద్రియ, దేశీయ పద్ధతిలో చేపట్టే ప్రకృతి వ్యవసాయంలోకి ఈ ఏడాది దేశవ్యాప్తంగా కోటి మంది రైతులను తీసుకవస్తామని చెప్పడం హర్షణీయమేనని అంటున్నారు. నూనె గింజల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

బంగారం, వెండి, మొబైల్ ఫోన్లు, వాటి విడిభాగాలపై కస్టమ్స్ డ్యూటీని తగ్గించడంతో ధరలు తగ్గనున్నాయి. ప్రపంచంలో అత్యధికంగా బంగారం, వెండి అమ్ముడు పోయే దేశ ప్రజలకు వాటిపై కస్టమ్ డ్యూటీ తగ్గించడం భారీగా ఊరట కలిగించనున్నది.

- తెలంగాణపై చిన్న చూపు..
- రాష్ట్రానికి, జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు నిల్
- బడ్జెట్‌పై నేతల అభిప్రాయాలు

● వేతన జీవికి ఊరట..

ఈ బడ్జెట్ ద్వారా వేతన జీవులకు కాస్త ఊరట కల్పించారు. 3 లక్షల రూపాయల వరకు ఆదాయం గల వారికి పన్నుల నుంచి మినహాయింపు కల్పించారు. 3నుంచి 7లక్షల రూపాయల వరకు 5 శాతం, 7నుంచి 10 లక్షల రూపాయల వరకు 10 శాతం, 10 నుంచి 12 లక్షల రూపాయల వరకు 15 శాతం, 12 నుంచి 15 లక్షల రూపాయల వరకు 20 శాతం, 15 లక్షల రూపాయలకు పైగా ఆదాయం గల వారికి 30 శాతం పన్ను చెల్లించే విధంగా శ్లాబులు ఏర్పాటు చేశారు.

బీజేపీకి తెలంగాణపై ప్రేమ లేదు..

- గడ్డం వంశీ కృష్ణ, పెద్దపల్లి ఎంపీ



ప్రభుత్వాన్ని కాపాడుకునేలా కేంద్ర బడ్జెట్ ఉంది. బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు పెద్ద పీట వేసి తెలంగాణకు గుండు సున్నా చూపారు. ఇది పొలిటికల్ బడ్జెట్‌లా ఉంది. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, తాము సహా అందరం పీఎం మోదీ, కేంద్ర మంత్రులను కలిసినా కూడా తెలంగాణకు ప్రత్యేకించి పెట్టిన బడ్జెట్ ఏమీ లేదు. పదేళ్లుగా విభజన చట్టం హామీలను నెరవేర్చకపోతున్నా బీజేపీ తెలంగాణపై వివక్షను కొనసాగిస్తూనే ఉన్నది. కాంగ్రెస్ నష్టపోయినా ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది. దీంతో సామాన్య ప్రజానికానికి ఒరిగేది ఏమి లేదు. తెలంగాణ నుంచి బీజేపీ ఎంపీలు 8 మంది గెలిచినా వారు సాధించింది ఏమిలేదు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదు. నిరుద్యోగులకు బీజేపీ 20 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉంది. రాష్ట్రానికి తగిన నిధులు, ప్రాజెక్టులు సాధించేంత వరకు పోరాడుతాం.

రాష్ట్రానికి ఇచ్చిందేమి లేదు..

- కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ మాజీ మంత్రి



రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ నుంచి, ఎనిమిది మంది కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీలుగా గెలుపొందినా కూడా కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి గుండు సున్నాయే దక్కింది. అధికార, ప్రతిపక్ష ఎంపీలకు మాట్లాడడానికి నోరు లేదు. ఇచ్చేటోళ్లకు దయలేదు. పార్లమెంట్ ఎన్నికలప్పుడు తాము చెప్పాం.. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకలు ఉండాలి అన్నాం.. ప్రాంతీయ పార్టీలను పార్లమెంట్‌కు పంపిస్తే వచ్చేవన్నీ వస్తాయి. ప్రస్తుతం ఉన్న సంకీర్ణ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్‌కు 15వేల కోట్లు, బీహార్‌కు 26 వేల కోట్లు బడ్జెట్ కేటాయించడమే నిదర్శనం. పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల తెలంగాణ అభివృద్ధికి నోచుకోదు. తెలంగాణ అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ఆరాట పడితే, కాంగ్రెస్, బీజేపీలు పదవుల కోసం పాట్లు పడతాయి. తెలంగాణ రాష్ట్ర విభజన హామీలను ఒక్కటి కూడా బీజేపీ నెరవేర్చ లేదు. తెలంగాణ అస్తిత్వం, అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం.

అన్ని వర్గాలను ఆకట్టుకునే బడ్జెట్..

- గొమాసే శ్రీనివాస్, బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జి



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజల ఆలోచలనకు అనుగుణంగా ఉంది. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రూపొందించింది. వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేయడంతో పాటు దేశీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు, నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్‌కు అత్యధిక నిధులు కేటాయించడం శుభపరిణామం. వచ్చే 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ వికసిత్ భారత్‌గా వెలుగొందేలా చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం. అన్ని రాష్ట్రాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే బడ్జెట్‌ను రూపొందించారు. బంగారం, వెండిపై కస్టమ్ డ్యూటీ తగ్గించడం వల్ల ఆభరణాల కొనుగోళ్లు పెరగనున్నాయి. ఆదాయ పన్ను మినహాయింపులో వేతన జీవులకు ఊరటనిచ్చారు.

ఎనిమిది మంది ఎంపీలున్నా..

- తాండ్ర సదానందం, సీపీఐ జిల్లా కార్యదర్శి



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్లో తెలంగాణకు గుండు సున్నే మిగిలింది. రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నా సాధించిందేమి లేదు. 48.21 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినా బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు పెద్దపీట వేశారు. ఈ బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరం. తెలంగాణక మరోసారి అన్యాయమే జరిగింది. విభజన చట్టంలో పేర్కొన్న హామీలు నెరవేర్చే దిశగా బడ్జెట్ లేదు. దేశంలో నిత్యవసర ధరలు ఆకాశాన్నంటిన వాటిపై ఊసే లేదు. ఈ బడ్జెట్‌తో సామాన్య ప్రజలకు ఒరిగేది ఏమీ లేదు. తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు వెళ్లి ఢిల్లీలో అడిగిన వాటిని కూడా పట్టించుకోకపోవడం విచారకరం.

కార్పొరేట్ అనుకూల బడ్జెట్..

- ఎరవెల్లి ముత్యంరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు వ్యతిరేకంగా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉంది. అత్యంత ఖరీదైన, ప్రమాదకరమైన అణు విద్యుత్తును అనేక దేశాలు తిరస్కరిస్తుంటే ఈ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చి, నిర్మిస్తామని పేర్కొంది. సహజ వనరులైన వివిధ రకాల గనులు, ఖనిజాలను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడానికి నిర్ణయించారు. భూమి మొత్తం కేంద్రీకరణ చేసి పెట్టుబడిదారులకు ఇవ్వడానికి నిర్ణయించారు. అత్యంత ఖరీదైన విద్య, వైద్యానికి తగిన నిధులు కేటాయించకపోగా, కొత్త లేబర్ ట్రిబ్యునల్ పేరుతో మొత్తం కార్మిక వర్గాన్ని యజమానులకు బానిసలుగా మార్చే విధానాన్ని తెస్తున్నారు, ఉపాధి హామీ స్కీంకు నిధులు కోత పెట్టారు. నిధుల కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు.

నితీష్, చంద్రబాబుల కోసం..

- ఈద శంకర్‌రెడ్డి, టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్



కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ భారత దేశ బడ్జెట్‌లా లేదు. బీహార్ నితీష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ చంద్రబాబుల కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లా ఉంది. మరొకసారి బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై తమకు ప్రేమ లేదని నిరూపించుకున్నది. ఈ రాష్ట్ర ప్రజలు ఎనిమిది ఎంపీలను గెలిపించినా కూడా కేంద్రం తెలంగాణపై కరుణ చూపలేదు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా, ఐఐఎం సహా జాతీయ సంస్థలను ఇవ్వమని మేము కోరినప్పటికీ ఒక్కటి కూడా ఇవ్వలేదు. ప్రకృతి వ్యవసాయానికి, నూనె గింజల పంటల సాగును ప్రోత్సహించేందుకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించడం ఆహ్వానించదగినదే.

తెలంగాణను దగా చేసిన కేంద్రం..

- ఆకుల వివేక్ స్వామి పటేల్, బీసీ సంఘం నాయకుడు



కేంద్రం ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో మరోసారి తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసింది. గడిచిన పదేళ్లలో విభజన చట్టంలో పేర్కొన్న ఒక్క హామీని నెరవేర్చలేని కేంద్రం బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు పెద్ద పీట వేసింది. పక్కా రాజకీయ కోణంలో తమ కుర్చీని కాపాడుకునేందుకు బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. బీజేపీకి రాష్ట్రం నుంచి ఎనిమిది ఎంపీలు, అందులో ఇద్దరు మంత్రులు ఉన్నా కూడా రాష్ట్రానికి సాధించిందేమి లేదు. బడ్జెట్‌లో వికసిత్ భారత్ కనబడడం లేదు. తెలంగాణపై వివక్ష కనబడుతున్నది.

డీఎస్సీ పరీక్షకు 360 మంది అభ్యర్థుల హాజరు

పెద్దపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న డీఎస్సీ నియామకాల పరీక్షకు మంగళవారం 385 మందికి 360 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సెంటినరీ కాలనీ జేఎన్‌టీయూ కళాశాలలో 200 మందికి 185 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పెద్దపల్లి మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో 95 మంది అభ్యర్థులకు 90 మంది హాజరయ్యారు. పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో 90 మంది అభ్యర్థులకు 85 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

'ఖని' ప్రభుత్వ ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసవం



అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీలతను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

కళ్యాణ్‌నగర్, జూలై 23: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఫోరెన్సిక్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీలతకు గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రసవం చేశారు. చాలామంది వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకుంటుండగా శ్రీలత మాత్రం తాను పనిచేసే హాస్పిటల్‌లో ప్రసవం చేయించుకుని వైద్యులకు ఆదర్శకంగా నిలిచారు. ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీలత ప్రసవం చేయించుకోవడంపై రామగుండం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ అభినందించారు.

ఎమ్మెల్యే లాస్య నందిత మృతి తీరని లోటు

- అసెంబ్లీలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూలై 23: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతికంటోన్మెంట్ ప్రజానీకానికి తీరని లోటని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మృతిచెందిన లాస్య నందితకు అసెంబ్లీలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రజలకు సాయన్న అందించిన సేవలు మరువలేనివని చెప్పారు. చిరు ప్రాయంలోనే కంటోన్మెంట్ నుంచి భారీమెజార్టీతో విజయం సాధించిన లాస్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం కలచి వేసిందని, వారి కుటుంబంతో తనకు విడదీయరాని బంధం ఉందని చెప్పారు.

పలువురు మంత్రులను కలిసిన మక్కాన్‌సింగ్

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పలువురు మంత్రులను కలిశారు. ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి పలు సమస్యలపై విన్నవించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుగ్యాల ప్రదీప్‌కుమార్

మంథని, జూలై 23: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చూపించాలని బీజేపీ నేతలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జరిగిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ.. జూఠా హామీల కాంగ్రెస్ ప్రభుత్వ నిజస్వరూపం 7 నెలల్లో ప్రజలకు తెలిసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్, పోడుభూములు, ధరణి, సింగరేణి, మంథనిలో డంపింగ్‌యార్డ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఎన్టీపీసీ ఉద్యోగాల కుంభకోణం, జెన్‌కో, నిరుద్యోగ సమస్య, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6గ్యారంటీలను అమలు తదితర సమస్యపై రాజకీయ తీర్మానం చేశామన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా రాష్ట్రంలో ప్రజల సమస్యలపై బీజేపీ పార్టీ పోరాటం చేస్తుందని, ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేసే పార్టీగా బీజేపీకి మంచిగుర్తింపు కార్యకర్తలు తీసుకరావాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీజేపీ పార్టీకి మరింత ఆదరణ పెరిగిందని, మంత్రి నియోజకవర్గంలో డంప్ యార్డు లేకపోవడం సిగ్గుచేటు, మాతశిశు హాస్పిటల్ సురక్షిత ప్రాంతంలో నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులందరికి రుణమాఫీ వర్తింపచేయాలి

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని ఇస్తున్న పుట్ట మధు

మంథని, జూలై 23: ఎన్నికల సమయంలో రైతులందరికి రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంక్షలు పెట్టి ఆగం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పుట్ట మధు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు చెవ్విలో పువ్వులు పెట్టుకుని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా పోరాడి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన గాంధీ పేరుతో పరిపాలన చేస్తున్న కాంగ్రెస్ ఆయన ఆశయాలకు తుంగలో తొక్కుతున్నారన్నారు. డిసెంబరు 9న అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి ఇప్పుడు 567 జీవో తీసుకువచ్చి రైతుల నోట్లో మట్టి కొట్టే కుట్ర చేశారన్నారు. రైతుబంధు లేకుండా రైతుభరోసా పేరు చెప్పిన కాంగ్రెస్ సర్కార్ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. రైతుల చెవ్వుల్లో పూలు పెట్టి రైతు రుణ మాఫీ చేశామని సంబరాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కళ్లు తెరిపించాలని, గాంధీ ఆశయాలను చెప్పుకుంటున్న పాలకులు కళ్లు తెరవాలని మహాత్మాగాంధీకి వినతిపత్రం అందజేశామన్నారు. తాము రుణమాఫీ చేస్తామనగానే కేసీఆర్ లక్ష రుణమాఫీ చేస్తున్నాడని, తాము రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఇప్పుడే బ్యాంకులకు వెళ్లి రుణాలు తెచ్చుకోండని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీలో ఆంక్షలు పెట్టి అనేక నిబంధనలను తెరపైకి తీసుకువచ్చారన్నారు. పంటల సాగు మొదలై నాట్లు జరుగుతున్నా ఇప్పటికి రుణమాఫీ లేదు రైతుబంధు రైతుభరోసా లేదన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రతి రైతును ఆదుకున్న చరిత్ర ఉందని, ఉచిత కరెంటు, పెట్టుబడి సాయం, రైతు బీమా లాంటి పథకాలను అమలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, సెగ్గెం రాజేష్, ఏగోళపు శంకర్ గౌడ్, బత్తుల సత్యనారాయణ, జంజర్ల శేఖర్, కాయితీ సమ్మయ్య, కలవేన శ్రీనివాస్, ఆసీఫ్, ఇర్ఫాన్, శ్రీనివాస్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి : కలెక్టర్



ఎలిగేడులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

ఎలిగేడు, జూలై 23 : గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండలంలోని బురహన్ మియాపేట్, సుల్తాన్‌పూర్, ఎలిగేడు గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. సుల్తాన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖి చర్చించి ప్రతిభ పాఠశాలను పరీక్షించారు. ప్రతి విద్యార్థికి డ్రెస్‌కోడ్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో అపరిశుభ్రతతో పాటు తరగతి గదుల్లో విద్యుత్‌పై నిర్లక్ష్యంగా వ్యవహించవద్దన్నారు. అనంతరం ఎలిగేడు ఎస్‌బీఐ బ్యాంకులో పరిశీలించి అక్కడ ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. రుణమాఫీపై సందేహాలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. గర్భిణులను గుర్తించి 100శాతం ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఆరోగ్యం పట్ల వైద్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అవసరమైన మందులు, పౌష్టికాహారం అందజేయాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ధరణి సమస్యలను అధిగమించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మహిళ సమాఖ్య గ్రామ అధ్యక్షులతో సమీక్ష నిర్వహించారు. మహిళలను లక్షాధికారులను చేయాలనే దృఢ సంకల్పంతో చేపట్టిన మహిళ స్త్రీశక్తి కార్యక్రమాన్ని సక్రమంగా చేపట్టాలని సూచించారు. మహిళ సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న వివిధ రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే విధంగా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎంపీవో అనిల్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం సుధాకర్, పీఆర్ ఏఈ జగదీశ్వర్, ఇన్‌చార్జి ఎంఈవో కవిత, శ్రీనిధి కోఆర్డినేటర్ రాకేష్, హెచ్ఎంలు నరేంద్రచారి, గంధ్ర దేవేందర్‌రావు, అప్పిడి సంతోరెడ్డి, నిస్సిక్రిష్టాన, మందలోజు శ్రీనివాస్, సీఆర్‌పీ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేకనే అసత్య ఆరోపణలు'

కళ్యాణ్‌నగర్, జూలై 23: కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను చూడలేక మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, కొలిపాక సుజాత ఆరోపించారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని, ఏ ఒక్క కార్యకర్త అయినా అవినీతి చేస్తే నిరూపించాలని వారు డిమాండ్ చేశారు. చందర్‌కు ప్రజలిచ్చిన అవకాశాన్ని వినియోగించుకోక కాంగ్రెస్‌పై బురద జల్లుతున్నారని, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అవినీతి లేకుండా పరిపాలన చేస్తున్నారని వారు చెప్పారు. కౌశిక హరి, తోట వేణు చరిత్ర రామగుండం ప్రజలందరికి తెలుసునని, పోచమ్మ మైదానంలో వేణు అనే వ్యక్తి డబ్బులు వసూలు చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రామగుండం అభివృద్ధికి మక్కాన్‌సింగ్ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తుంటే వేణు కొంత మందిని పోగు చేసి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొంతమంది పదవీవిరమణ పొందినా షాపులను కిరాయికి ఇచ్చుకుని పేద వారి నుంచి వేలాది రూపాయలు కిరాయిలు వసూలు చేస్తున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఏ ఒక్క చిరు వ్యాపారికి అన్యాయం జరగదని, వారికి సింగరేణి కానీ, మున్సిపల్ కానీ షాపింగ్‌లు నిర్మించి ఇస్తారని చెప్పారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం మాజీ ఎమ్మెల్యే చందర్ ఒక్క రూపాయి నిధి అయినా తీసుకరాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు, రూ.2లక్షల రుణ మాఫీ చేయడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతున్నదన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తిప్పారపు శ్రీనివాస్, మారెల్లి రాజిరెడ్డి, కొలిపాక మల్లయ్య, పెద్దెల్లి ప్రకాష్, దీటి బాలరాజు, నాజీమ్, కళ్యాణి సింహాచలం, కీర్తి నాగరాజు, బొంతల లచ్చన్న, దశరథం, జ్యోతి, లావణ్య, మీసాల సతీష్, అల్లి శంకర్, అశోక్, సంధ్య, రాజిరెడ్డి పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

జమ్మికుంట, జూలై 23: జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని హుండీ ధ్వంసం చేసిన దొంగలు 40 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకోని విచారణ చేపట్టారు.













వస్త్ర పరిశ్రమ మనుగడకు చర్యలు తీసుకోవాలి

ప్రజా సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 23 : సిరిసిల్ల వస్త్ర పరిశ్ర మనుగడ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిరిసిల్లలో చేపట్టిన నిరాహారదీక్షకు మద్దతు తెలుపుతూ ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆరు నెలలుగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతో తొమ్మిది మంది కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. సంక్షోభ నివారణకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం మూలంగా వస్త్ర పరిశ్రమ నడవక కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కుటీర పరిశ్రమగా ఉన్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను బతుకమ్మ చీరల పేరుతో ఎస్ఎస్ఐ యూనిట్స్, మాక్స్ సంఘాలను పెట్టించిందని, మిగతా క్వాలిటీ గుడ్డను నడవకుండా పూర్తిగా లూమ్స్‌పై బతుకమ్మ చీరల మాత్రమే నడపాలని నిబంధన పెట్టి పాలిస్టర్, కాటన్ పరిశ్రమ మనుగడ లేకుండా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీని కొనసాగించాలని, యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్, నేతన్న బీమా, నేతన్న చేయుత, వర్క్ టూ ఓనర్ పథకాలను అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వం స్పందించక పోతే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు, సీపీఐ జిల్లా నాయకుడు మీసం లక్ష్మణ్, విద్యార్థి సంఘం నాయకుడు అంగూర్ రంజిత్, దళిత సంఘాల నాయకులు మంగళి చంద్రమౌళి, రాజశేఖర్, మురళి, బాలరాజు, చంద్ర పాల్గొన్నారు.


కల్వల ప్రాజెక్టుకు గండి



గండి పడి దిగువకు పోతున్న నీరు

శంకరపట్నం, జూలై 23: శంకరపట్నం మండంలోని కల్వల ప్రాజెక్టుకు మంగళవారం గండి పడి నీరు దిగువకు పోతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరింది. మత్తడి దగ్గర కట్ట బలహీనంగా ఉండడంతో గండి పడింది. దీంతో ప్రాజెక్టులోని నీరు వృథాగా దిగువకు పోతోంది. గత సంవత్సరం వర్షాకాలంలో ప్రాజెక్టుకు గండి పడడంతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. వేసవిలో పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేపట్టకపోవడంతో, తాత్కాలిక మరమ్మత్తులు చేసిన చోట కట్ట బలహీనపడి గండి పడింది. దీంతో కల్వల ప్రాజెక్టుపై ఆధారపడిన శంకరపట్నం, వీణవంక మండలాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.





ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

ప్రాజెక్టులోకి 25,490 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 25,490 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 23.122 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 52.948 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీ రథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 532 క్యూ సెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 16.944 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.155 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూలై 23: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూన్ 2024లో నిర్వహించిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు శాతవాహన విశ్వ విద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. పరీక్ష ఫలితాలను శాతవాహన యూనివర్సిటీ వెబ్సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ యువకుడి మృతి

సుల్తానాబాద్, జూలై 23: సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి వద్ద రాజీవ్ రహదారిపై మంగళ వారం జరి గిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన గుండ్ల శ్రీనివాస్(27) ఉదయం బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరగా, సుల్తానాబాద్ మం డలం నర్సయ్య పల్లి వద్ద లారీ ఢీకొన్నది. ఈ ప్రమా దంలో అతను తీవ్రంగా గాయపడగా సుల్తానా బాద్ ఆస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ అసుపత్రికి తరలించగా మృతిచెంది నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన లారీ డ్రైవర్ బండ శివ నాగేశ్వర్‌రావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



అతిసారం.. ప్రమాదకరం

● డయేరియాతో డీ హైడ్రేషన్ ● అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

అతిసారకు కారణాలు

బ్యాక్టీరియా, వైరల్ పరాన్న జీవుల వలన అతిసార వ్యాధి వస్తుంది. ఎక్కువగా మలం, కలుషిత నీటి వలన డయేరియా సోకుతుంది. తాగడానికి, వంట చేయడానికి సురక్షితమైన నీరు వాడక పోవడం, పారిశుధ్య లోపం వ్యాధికి ప్రధాన కారణం కావచ్చు. ఐదేళ్ల కంటే తక్కువ వయసు పిల్లల్లో వైరల్ వ్యాధి కారకాలు రోట వరస్, నోరో వైరస్, అడెనో వైరస్, బ్యాక్టీరియల్ వ్యాధి కారకాలలో ఎస్చెరియా కోలి, సాల్మోనెల్లా, షిగెల్లా ఉన్నాయి.

నివారణ చర్యలు

- సురక్షితమైన తాగు నీరు ఉపయోగించడం.
- వ్యక్తిగత, ఆహార పరిశుభ్రత పాటించడం.
- సబ్బుతో చేతులు కడుక్కోవడం.
- అంటు వ్యాధులపై అవగాహన కలిగి ఉండడం.
- రోటా వైరస్ టీకా వేసుకోవడం.
- పౌష్టికాహారం తీసుకోవడం.

వెల్గటూర్, జూలై 23: వర్షాకాలం వచ్చిందంటేనే వాతావరణ మార్పులతో పాటు సీజనల్ వ్యాధులు కూడా వ్యాపిస్తుంటాయి. బావులు, బోరు బావుల్లో కొత్త నీరు చేడంతో కలుషిత నీరు తాగడం వలన కూడా వ్యాధులు ప్రభలడానికి అవకాశం ఉంది. వర్షా కాలంలో ప్రభలే వ్యాధుల్లో అతిసార వ్యాధి ఒకటి. అతిసార వలన వాంతులు విరేచనాలు కలిగి శరీరం మొత్తం డీ హైడ్రేషన్ కావడంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. అతిసారం అతి ప్రమాదకరమైందని, దీని వలన ప్రాణాలకు ముప్పు వాటిల్లకూడదంటే అప్రమత్తత చాలా అవసరమని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత అత్యవసరమని పేర్కొంటున్నారు. అతిసార ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఎక్కువగా వస్తుంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించే అవగాహన లేకపోవడంతో చిన్నారులకు ఎక్కువగా సోకుతుంది. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లల్లో పోషకాహార లోపం కూడా అతిసారం ప్రధాన కారణమని వైద్యాధికారులు అంటున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెరగడం, మెరుగైన వైద్య చికిత్స విధానాలు అందుబాటులోకి రావడంతో జిల్లాలో కొన్నేళ్లుగా అతిసార మరణాలు సంభవించలేదు.

అవగాహన అవసరం

అతిసార (డయేరియా) వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలి. డయేరియా సోకకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం. కలుషిత ఆహారం, కలుషిత నీరు, పారిశుధ్య లోపం అతిసార వ్యాధికి ప్రధాన కారణ మని చెప్పవచ్చు. సెప్టిక్ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు కూడా డయేరియాకు కారణం కావచ్చు. అతిసార వ్యాధి సోకిన వారికి సుమారు పక్షం రోజుల పాటు వాంతులు, విరేచనాలు ఉంటాయి. దీనితో శరీరంలో నీరు, లవణాలు కోల్పోయి ప్రాణాలకు ముప్పు కలుగవచ్చు. పోషకాహార లోపం, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు, గుండె, కిడ్నీ, షుగర్ సంబంధిత వ్యాధులు ఉన్న వారు అతిసార వ్యాధి బారిన పడే అవకాశం అధికంగా ఉంది.

డీ హైడ్రేషన్‌తో ప్రాణాలకు ముప్పు

డయేరియా సోకిన వారికి వాంతులు, విరేచనాలు కొన్ని రోజులు పాటు కొనసాగడంతో శరీరం డ్రై హైడ్రేషన్ కారణంగా ప్రాణాలకు ముప్పు వాటిల్లవచ్చు. తీవ్రమైన డీ హైడ్రేషన్ కారణంగా అపస్మారక స్థితికి వెళ్లే అవకాశం కూడా ఉంటుంది. విరేచనాలు కావడం వలన శరీరంలో నీటితో పాటు సోడియం, పొటాషియం, క్లోరైడ్ బై కార్బోనేట్ వంటి ఎలక్ట్రోలైట్లు కోల్పోతాయి. ద్రవ మలం, వాంతులు, మూత్రం, చెమట ద్వారా శరీరం నీటిని కోల్పోతుంది. నిరంతర విరేచనాలు, మలంలో రక్తం కనిపించినపుడు లేదా డీ హైడ్రేషన్ సాంకేతాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం ఉత్తమం.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



అతిసార వ్యాధితో పాటు సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండాలంటే వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలి. బయటి ప్రదేశాలకు వెళ్లి వచ్చినపుడు, మల, మూత్రాలు విసర్జించినపుడు చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలి. బయటి పదార్థాలు తినకూడదు. వాంతులు, విరేచనాలు అయినపుడు వైద్యులను సంప్రదించాలి. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. కొన్నేళ్లుగా జిల్లాలో డయేరియా మరణాలు లేవు. కోటి లింగాలలో డయేరియాతో మృతి చెందిన కేసు ఇటీవలే నమోదైంది.



కోటిలింగాలలో పరిసరాలు పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

బెల్ట్‌షాపు నిర్వాహకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జూలై 23: సుల్తానాబాద్ మండలంలోని మియాపూర్ గ్రామానికి చెందిన కేశ సంతోష్ సోమవారం రాత్రి ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. రెండేళ్లుగా గ్రామంలో సంతోష్ బెల్టుషాపు నిర్వహిస్తుండగా, పది రోజుల క్రితం నుంచి మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పెంచి అమ్ముతున్నారని, దాంతో తన వద్ద ఎవరూ అంత ధర పెట్టి మద్యం కొనుగోలు చేయడం లేదని, వ్యాపారులు ధరలు తగ్గించాలని తన స్టేటస్ లో పెట్టుకున్నాడు. దీంతో మద్యం సిండి కేట్ నిర్వాహ కులు తనకు ఫోన్ చేసి బెదరించారని సంతోష్ తన సెల్ఫీ వీడియోలో ఆరోపించాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా, సిండికేట్ గురించి అబ్కారీ సీఐ రఘునాథ్‌ను అడుగగా అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో ఆస్తినష్టం

పెద్దపల్లి రూరల్, జూలై 23 : పెద్దపల్లి మండలంలోని కనగర్తికి చెందిన ఏడెల్లి పద్మకు చెందిన ఇంటిలో విద్యుదాఘాతంతో ప్రమాదం చోటుకుంది. ఫైర్ ఆఫీసర్ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏడెల్లి పద్మ వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా, ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 4లక్షల 50 వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితురాలు పేర్కొంది.

రైల్వే స్టేషన్లో ఒకరి మృతి

జమ్మికుంట, జూలై 23: జమ్మికుంట రైల్వే స్టేషన్ లోని టికెట్ బుకింగ్ కౌంటర్ హాల్‌లో నిద్రించిన ఓ వ్యక్తి మృతి చెందాడు. బీహార్ రాష్ట్ర నలంద జిల్లా పినిపర్‌కు చెందిన దినేష్ యాదవ్ (46) పట్టణంలోని ఓ రైస్ మిల్లులో కొంత కాలంగా పని చేస్తున్నాడు. మంగళ వారం స్వగ్రామం వెళ్లేందుకు రైల్వే స్టేషన్ చేరుకున్నాడు. టికెట్ బుకింగ్ కౌంటర్ హాల్ లో నిద్రించాడు. చుట్టు పక్కల వారు లేపినా లేవక పోయే సరికి అధికారులకు తెలిపారు. వారు డాక్టర్‌ను పిలిచి పరీక్షించగా మృతి చెందాడని నిర్ధారించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంట ఉత్పత్తులకు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించకపోవడం బాధాకరం

- దేశ వ్యాప్తంగా రైతు రుణ మాఫీని బడ్జెట్‌లో విస్మరించారు
- ఆర్మూర్ - ఆదిలాబాద్ రైల్వే లైన్ ఊసే లేదు

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో పంట ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత కల్పించకపోవడం బాధాకరమని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళ వారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తమకు వరాలు ప్రకటిస్తారని అన్నదాతలు ఆశించినప్పటికీ నిరాశకు గురిచేశారన్నారు. రైతాంగాన్ని రుణ విముక్తులను చేయడానికి జాతీయ స్థాయిలో ప్రయత్నాలు బడ్జెట్‌లో చేయలేదని విమర్శించారు. అంబానీ, ఆదానీ లాంటి వారికి రూ. లక్షల కోట్లు రాయితీ కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించడం విచారకరమన్నారు. తీవ్ర అప్పుల్లో కూరుకపోయిన రైతాంగాన్ని రుణ విముక్తులను చేయడానికి కేంద్రం రుణమాఫీ కార్యక్రమం ప్రారంభించాల్సిన అవసరముందన్నారు.

గతంలో 2008 సంవత్సరంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రూ. లక్ష రైతు రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 15 సంవత్సరాల కాలంలో ఏ ప్రభుత్వం కూడా రుణమాఫీపై ఆలోచన చేయలేదని విమర్శించారు. ఆర్మూర్ - ఆదిలాబాద్ రైల్వే లైన్ నిర్మాణ వ్యవహారాన్ని బడ్జెట్‌లో విస్మరించారన్నారు. ఈ రైల్వే లైన్ నిర్మాణం వల్ల దక్షిణ భారతదేశం, ఉత్తర భారతదేశాన్ని కలిపే విధంగా సికింద్రాబాద్ - ఢిల్లీ లైన్ సుమారు వంద కిలో మీటర్ల దూరం తగ్గుతుందని, సుమారు రెండు గంటల సమయం ఆదా అయ్యే అవకాశాలున్నాయన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అంశం రైల్వే లైన్ కాదని, ఇంతటి ప్రాధాన్యత ఉన్న రైల్వే లైన్‌పై తెలంగాణ రాష్ట్రం పట్ల వివక్షత కాదా అని, దక్షిణ భారత దేశాన్ని బడ్జెట్‌లో విస్మరించారని విమర్శించారు. ఆంధ్రాకు సంబంధించిన అంశాలకు సుమారు రూ. 15 వేల కోట్లను బడ్జెట్‌లో మంజూరు చేశారన్నారు. గతంలో యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన తెలంగాణలో ఐటీఐఆర్ ప్రాజెక్టు పునరుద్ధరణకు బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తారని ఆశించామని ఎటువంటి ప్రస్తావన బడ్జెట్‌లో చేయలేదన్నారు. మూసి రివర్ ఫ్రంట్‌కు సంబంధించి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారని భావించామని కేంద్రం బడ్జెట్‌లో విస్మరించిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పాత్ర పోషించినప్పటికీ తెలంగాణలో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సత్సంబంధాలు కొనసాగిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన స్పందన కనబడడం లేదని తెలిపారు.

స్థానిక సంస్థలు

ఆదాయాన్ని పెంపొందించుకోవాలి

- అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

కరీంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో ఆదాయాన్ని మరింత పెంపొందించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు. మంగళవారం కరీం నగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులతో స్థానిక సంస్థల విధులు-బాధ్యతలపై రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అధికారుల నుంచి విధులు, బాధ్యతలు, ఆదాయం పెంచే మార్గాలపై సూచనలు సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులపైనే ఆధారపడకుండా సానికల సంస్థలు మరింత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. స్థానిక సంస్థల ఆర్థికంగా బలోపేతమైతేనే రాష్ట్రం, దేశం పటిష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాకు అన్ని అంశాలపై అవగాహన ఉన్న కలెక్టర్ పమేలా సత్పతి దొరకడం జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. అధికారుల సూచనల మేరకు జిల్లా కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్న నమ్మకం ఉందని తెలిపారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి చర్యలు

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

గ్రామాలు, పట్టణాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభిప్రాయపడ్డారు. మహిళా సంఘాల అభివృద్ధితోనే స్థానిక సంస్థలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. స్వశక్తి మహిళా సంఘాలు అప్పగించిన పనులను దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు, స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ పనులు అద్భుతంగా పూర్తి చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళలను కోటీశ్వరులు చేసే కార్యక్రమంలో భాగంగా ముందుకెళ్తున్నామని వివరించారు. అన్ని అంశాలను చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఎం రమేష్, సంకెపెల్లి సుధీర్‌రెడ్డి, మాలోతు నెహ్రూనాయక్, రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం చంద్రకళ, రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు, పెద్దపెల్లి అదనపు కలెక్టర్ అరుణశ్రీ, కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీపీఓ రవీందర్, జెడ్పీ సీఈవో లు శ్రీనివాస్, గౌతమ్‌రెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని డీఆర్డీవోలు, సీఈవోలు డీపీఓలు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రయోగాలు చేయాలి

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సెక్రెటరీ స్మితా సబర్వాల్

గ్రామాలు, పట్టణాల్లో ఆదాయం పెంచే మార్గాలపై అధికారులు కొత్త కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సెక్రెటరీ స్మితా సబర్వాల్ సూచించారు. స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు ఫైనాన్స్ కమిషన్ కీలకపాత్ర పోషిస్తుందని, ఇది తమ బాధ్యత అని పేర్కొన్నారు. కరీంనగర్ గడ్డ తనకెంతో ఇష్టమని తెలిపారు. మున్సిపాలిటీల్లో అనవసర ఖర్చులు తగ్గించుకుంటూ, ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు.



రాజయ్యకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

వసతిగృహాల్లో అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలి

● రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసిపేద్ది శ్రీధర్‌రాజు

గణేశ్‌నగర్,జూలై 23: జిల్లా బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యుత్ బిల్లుల పేరిట లక్షలాది రూపాయల అవినీతి అక్రమాలపై విచారణ జరి పించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయదేవికి మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ సం ఘం ప్రధాన కార్యదర్శి కెసిపేద్ది శ్రీధర్‌రాజు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మానకొండూర్ బీసీ సమీకృత వసతి గృహంలో దాదాపు 40 లక్షల పైగా విద్యుత్ బిల్లుల పేరిట అధి కారులు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. బాధ్యులందరిపై చర్యలు తీసుకోలేదన్నారు. 2018 నుంచి 2022 వరకు విద్యుత్ బిల్లులకు కేటాయించిన నిధులపై దాని వినియోగంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖకు పూర్తి స్థాయి అధికారులు లేకపోవడం వల్ల కార్యాలయంలో పని చేసే అడ్మినిస్ట్రేషన్ అధికారి తన ఇష్టారాజ్యంగా వ్యవహరించి తనకు అనుకూలంగా ఉన్న వారికి ఎక్కువ నిధులు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకొని బీసీ సంక్షేమ శాఖను కాపాడాలని అన్నారు.



వినతి పత్రం చూపుతున్న కెసిపేద్ది శ్రీధర్‌రాజు

ఇద్దరు చెయిన్ స్నాచర్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, జూలై 23: ఒక యువకుడి మెడలోని బంగారు చెయిన్‌ను దొంగలించిన ఇద్దరు చెయిన్ స్నాచర్లను అరెస్టు చేశామని కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. ఏసీపీ వివరాల ప్రకారం....

కట్టరాంపూర్‌కు చెందిన సమంత్ కోతిరాంపూర్‌లో జరుగుతున్న బోనాలలో పాల్గొని ఈ నెల 17న ఉదయం 4 గంటలకు బైక్‌పై ఒంటరిగా ఇంటికి వస్తుండగా తిరుమల్ నగర్ రోడ్ నంబరు 6 వద్ద ఇద్దరు ద్విచక్రవాహనంపై వచ్చి సమంత్ మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు తెంపుకుని పారిపోయారు. బాధితుడు వెంటనే కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేప ట్టిన పోలీసులు మం గళవారం ఉజ్వల పార్క్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా బంగారు గొలుసు లభ్యమైంది. విచారించగా చెయిన్ స్నాచింగ్ చేసిన నేరం ఒప్పుకున్నారు.

నిందితులు హైదరాబాద్‌కు చెందిన బీటెక్ విద్యార్థి ఎండీ ఫైజాన్(22), మానకొండూర్‌కు చెందిన షేక్ సాహిద్ (22)లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి బంగారు గొలుసు, ద్విచక్రవాహనం స్వాధీ నం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కమాన్‌పూర్, జూలై 23 : మండలంలోని గొర్రెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ధనపునేని అనిల్(30) వృతిరీత్యా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ నెల 22న సాయం త్రం 4 గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగి పడిపోగా గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ధనపునేని నర సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వస్త్ర పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

మాజీ ఎమ్మెల్సీ చెరుపెల్లి సీతారాములు



సిరిసిల్లలో దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సీతారాములు

సిరిసిల్ల రూరల్, జూలై 23 : సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు మంగళవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీతారాములుతోపాటు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూర పాటి రమేష్ మద్దుతు తెలిపారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూఉపాధిలేక మరమగ్గాల కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో అత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందని మండిపడ్డారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తొమ్మిది నెలలనుంచి సంక్షోభంలో కూరుకపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకోవాలన్నారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు సంబంధించి కరెంట్ సమస్య పెనుశాపంగా మారిందన్నారు. పది హెచ్‌పీల వరకు ఉచిత కరెంట్ ఇచ్చి ఆ తర్వాత వాటికి నాలుగో కేటగిరి కింద 50 శాతం సబ్సిడీ కొనసాగించాలన్నారు. బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్‌లు ఇవ్వాలన్నారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని అందించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షో భానికి బాధ్యత వహించాలన్నారు. వస్త్ర పరిశ్రమపై జీఎస్టీని రద్దు చేయాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమర్ సిరిసిల్ల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. సిరిసిల్ల నేతన్నలకు ఉపాధిని కల్పించే విధంగా కేంద్రం నుంచి ఆర్డర్లను తీసుకురావాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల సంక్షోభంపై మాట్లాడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతన్న సమస్యలకు పరిష్కారానికి కృషి చేయాలని, వారి బతుకులతో రాజకీయం చేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఈ నెల 26లోగా సమస్యలను పరిష్కరించకుంటే ఇంటికో వ్యక్తి చలో హైదరాబాద్ తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు యెల్లెండి దేవాదాస్, గాజుల నారాయణ, ఏనుగుల ఎల్లయ్య, సిరిసిల్ల రవీందర్, ఎక్కలదేవి జగదీష్, శ్రీగాద మైసయ్య, చేరాల అశోక్, కోడం అశోక్, బండారి అశోక్, మ్యాన సత్యనారాయణ దీక్షలో కూర్చున్నారు. మూషం రమేష్, పంతం రవి, దామోదర్, మండల సత్యం, మోర రాజు, అడెపు భాస్కర్, కుమ్మరికుంట కిషన్, గోనె పర్శరాములు పాల్గొన్నారు.

వర్షంలో భోజనాలు చేస్తూ రాస్తారోకో

రిలే నిరాహార దీక్షల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా జేఏసీ ఆధ్వర్యంలో యజమానులు, ఆసాములు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు భోజనాలు చేస్తూ రాస్తారో చేపట్టారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ సైతం నిరసన తెలిపారు. ట్రాఫిక్ స్తంభించిపోవడంతో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వారితో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్



గణేశ్‌నగర్, జూలై 23: వినియోగ దారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా కరీంనగర్ సర్కిల్ పరిధిలో 189 కెపాసిటర్ బ్యాంకులు పెట్టినట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. ఇంకా 12 కెపాసిటర్ బ్యాంకులు పెట్టనున్నట్లు తెలిపారు. వోల్టేజ్‌లో హెచ్చుతగ్గులు లేకుండా కెపాసిటర్ బ్యాంకులు ఉపయోగపడుతాయని అన్నారు. కెపాసిటర్ బ్యాంకులతో సబ్‌స్టేషన్, లైన్లలో విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ కాకుండా నియంత్రిస్తున్నదన్నారు. సబ్ స్టేషన్‌లలో, అలాగే 11కెవి లైన్లలో కెపాసిటర్లు అమర్చడం వలన పవర్‌ఫాక్టర్ మెరుగుపడుతుందన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు, పారిశ్రామిక ఫీడర్లకు లోవోల్టేజ్ వలన మోటార్లు కాలిపోకుండా ఉండేందుకు కెపాసిటర్ బ్యాంకులు దోహద పడుతాయన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థలో పవర్ ఫ్యాక్టర్ ఘననీయంగా మెరుగు పరచడానికి కెపాసిటర్ బ్యాంకులు దోహద పడుతున్నాయన్నారు. టెక్నికల్ నష్టాలు ఘననీయంగా తగ్గుతాయన్నారు. పరికరాల మన్నిక చాలాకాలం పెరుగుతుందన్నారు. పారిశ్రా మిక వినియోగదారులకు కెపాసిటర్లు పెట్టు కోవడానికి ప్రోత్సహిస్తున్నామన్నారు. వీటి వలన ట్రాన్స్‌పార్మర్లపై లోడ్ భారం తగ్గి మోటార్లు కాలిపోకుండా మన్నిక పెరుగుతుందని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

పెద్దపల్లి రూరల్, జూలై 23 : మండలంలోని పెద్దబొంకూర్ గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా పుట్ట శ్రీనివాస్ బాధ్యతలు తీసుకోగా మంగళవారం గ్రామస్థులు మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యదర్శికి స్వాగతం పలుకుతూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మల నరేష్ గౌడ్, కలవేన రవి, కల్వల తిరుపతి, జగన్, కారుపాకల తిరుపతి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారికి సన్మానం

ఓదెల, జూలై 23 : మండలంలోని కొలనూర్ పశువైద్యాధికారి మౌనికను యాదవులు మంగళవారం సన్మానించారు. ఇతర మండలానికి పశువైద్యాధికారి బదిలీ కాగా యాదవ సంఘం వీడ్కోలు సన్మాన సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మౌనిక రైతులకు, యాదవులకు చేసిన సేవలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నాల భూమయ్య, కుమారస్వామి, శంకర్, ఓదెలు, భూమయ్య, జట్టి ఓదెల, తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో వంతెన నిర్మాణం

పాలకుర్తి, జూలై 23: మండల పరిధిలోని రాజీవ్ తండాకు వెళ్లే దారిలో కాలువపై బామ్లనాయక్ తండా మాజీ సర్పంచ్ రాజునాయక్ మంగళవారం స్వంత ఖర్చులతో వంతెన నిర్మించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, పెద్దలు మధు, పులచంద్, చందు నాయక్, గట్టయ్య, తిరుపతి, సంపత్, సురేష్, కిషన్, భోజ్యనాయక్, సారయ్య, పున్నంచంద్, యువకులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఎంపీ ఆర్థిక సాయం

కాల్వశ్రీరాంపూర్, జూలై 23: మండలంలోని ఆశన్నపల్లె గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు మంద అభిలాష్, మంద మనిషాలను ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ మంద రమవెంకన్న ఎంపీ గడ్డం వంశీకృష్ణకు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ రూ.5వేలు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సకాలంలో బియ్యం పంపిణీ చేయాలి

రామగిరి, జూలై 23: బియ్యం సకాలంలో పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ మానస సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో బియ్యం పంపిణీపై పలు సలహాలు, సూచనలు చేశారు. పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టి తీసుకరావాలని పేర్కొన్నారు. బియ్యం పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు మహేష్‌బాబు, నిహారిక పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రామగిరి, జూలై 23: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 ప్రమాదంలో మృతిచెందిన వెంకటేశ్వర్లు కుటుంబాన్ని మంగళవారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, నాయకులు గోమాసే శ్రీనివాస్, చల్ల నారాయణరెడ్డి, సురేష్‌రెడ్డి, హనుమంతుగౌడ్, వెంకటరమణ, మోల్మూమూరి శ్రీనివాస్, తీగల శ్రీధర్, తొట్ల రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్‌లో..

కమాన్‌పూర్, జూలై 23 : మండల కేంద్రానికి చెందిన రెడ్డి అభిలాష్, కిష్టంపల్లెకు చెందిన గుంజపడుగు నర్సయ్యలు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను మంగళవారం జడ్పీ మాజీ ఛైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతికిగల కారణాలు కుటుంబసభ్యులను అడిగి తెలుసుకొని సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే బీఆర్ఎస్ యూత్ నాయకులు మార్త సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా పరామర్శించారు. వెంట మాజీ సర్పంచ్ నీలం సరిత, నాయకులు నీలం శ్రీనివాస్, రెడ్డి రాజనర్సు, వరాల ఎల్లయ్య, తోడేటి మహేందర్, ఆకుల బాపు, ఆకుల రాయమల్లు, కూసన మల్లయ్యకూసన శంకర్, తోట రాజ్‌కుమార్, సాన సురేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


ఖనిలో పారిశుధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


పత్తిపాకలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుష్మిత

కోల్‌సిటీ, జూలై 23: వర్షాకాల సీజన్‌లో పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తడి చెత్తలో ఉండే బ్యాక్టీరియా శరీరంలో చేరి వ్యాధులకు కారణమవుతుందని రామగుండం మేయర్ బంగి అనీల్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ అనీల్ కుమార్, కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులు తప్పనిసరిగా గ్లౌజ్‌లు, మాస్క్‌లు, షూస్ ధరించాలన్నారు. ప్రజారోగ్యం కోసం పాటుపడుతున్న కార్మికులు తమ ఆరోగ్యంపై కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య సేవలందిస్తున్న ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో 300మంది కార్మికులకు బీపీ, షుగర్, గుండె పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు నాగరాజు, వేణుగోపాల్, హాస్పిటల్ హెడ్ కిరణ్, కార్పొరేషన్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, ఆసుపత్రి సిబ్బంది కోట కరుణాకర్, హరీష్, యూనస్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జూలై 23: సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వరాల గురించి పట్టణంలోని ఇంటింటా సిబ్బంది ఆరా తీశారు. జ్వరాలతో బాధపడుతున్న పలువురికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సింధూజ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం, జూలై 23: ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో మంగళవారం నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 210 మందికి ఆరోగ్యకరమైన పరీక్షలు నిర్వహించారు. ఇందులో 140మందికి డెంగ్యు, మలేరియా, డయాబెటిష్ తదితర వ్యాధులకు రక్త నమునాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామంలో 650ఇళ్లలో పైరిత్రం స్ప్రే చేశారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మలేరియా ప్రోగ్రాం అధికారి సుధాకర్‌రెడ్డి సూచించారు. శిబిరంలో నందిమేడారం వైద్యాధికారి సుష్మిత, డాక్టక్ అమర్నాథ్, లావణ్య, గౌతమ్, స్వరూప్‌కిరణ్, యాదగిరి, అంజయ్య. ఎంపీవో రమేష్. స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కమాన్‌పూర్, జూలై 23 :మండలంలోని జూలపల్లిలో మంగళవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె దవాఖాన వైద్యులు అశోక్ ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబటి శంకర్, కారోబార్ బర్ల భూమయ్య, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

మరమ్మతులకు నోచుకోని చెరువులు, కుంటలు

కాల్వశ్రీరాంపూర్, జూలై 23: మండల కేంద్రంలోని మల్లయ్య కుంట నుంచి నీలకంఠ చెరువుకు సాగునీరు వచ్చే కట్టుకాలువ పిచ్చి మొక్కలతో నిండి ఉంది. నీలకంఠ చెరువులోకి నీరు రావాలంటే మల్లయ్య కుంట నిండి మత్తడి నుంచి కట్టు కాలువ ద్వారా రావాలి. కట్టుకాలువ ప్రస్తుతం పూడికతో నిండి ఉండడంతో పాటు కాలువ నిండా పిచ్చి మొక్కలు ఉన్నాయి. దీంతో సాగునీరు రావడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వర్షాలు కొట్టినా నీలకంఠచెరువు సగం కూడా నిండలేదు. కట్టు కాలువ సరిగా లేని కారణంగా నీలకంఠ చెరువులోకి నీరు రావడంలేదని రైతులు పేర్కొంటున్నారు.

కట్టు కాలువ ద్వారా చెరువులోకి నీరు రావాలంటే పూడిక, పిచ్చి మొక్కలు తొలగిస్తే నీరు చెరువులోకి వేగంగా చేరుతుంది. కట్టు కాలువ ఇళ్ల మధ్యలో ఉన్న కారణంగా కొందరు కబ్జా చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ప్రజాప్రతినిధులు కట్టు కాలువను మరమ్మతులు చేయిస్తామని ఇచ్చిన హామీలు నెరవేర లేదని రైతులు తెలిపారు. మల్లయ్య కుంట నుంచి ఈ కట్టు కాల్వ ద్వారా నీరు నీలకంఠ చెరువు, అయ్యవార్లకుంట, దామన్నకుంట, తదితర కుంటలకు సాగునీరందితే రైతులకు రెండు పంటలకు ఉపయోగపడుతుంది.

ప్రభుత్వం స్పందించి మల్లయ్యకుంట నుంచి నీలకంఠ చెరువు వరకు వెళ్లే కట్టు కాలువ మరమ్మతులు చేపట్టాలని రైతులు, మత్స్యకారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కోట్లు వెచ్చించినా నెరవేరని లక్ష్యం

- నిరుపయోగంగా కస్తూర్బా విద్యాలయ భవనం - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలకుర్తి, జూలై 23: మండలం పరిధిలోని పుట్నూర్ గ్రామశివారులో కోట్లు వెచ్చించి నిర్మించిన కేజీబీవీ పాఠశాల భవనం నిరుపయోగంగా మారింది. గ్రామానికి దూరంగా కండిగుట్ట అటవీ ప్రాంతాన్ని ఆనుకొని 2 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన భవనానికి ఆఘమేఘాల మీద శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారు. అంతకుముందే అక్కడ వైకుంఠధామం, డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్డు నిర్మించారు. వాటిని చూసీచూడనట్లు వ్యవహరించిన అధికారులు వాటి మధ్యలోనే మూడు కోట్ల 50 లక్షల సమగ్ర శిక్షా అభియాన్ నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. గతేడాది అక్టోబరు 8న అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. బాలికల పాఠశాల భవనానికి ప్రహరి సైతం నిర్మించకుండానే ఎమ్మెల్యే ప్రారంభించడం గమనార్హం. బాలికలకు మెరుగైన విద్య, వసతి కల్పించాలన్న లక్ష్యంతో 2017లో పాలకుర్తి మండలానికి కస్తూర్బా బాలికల విద్యాలయం మంజూరైంది. భవనం నిర్మాణం, ప్రారంభోత్సవం జరిగి నెలలు గడుస్తున్నా కొత్త భవనంలో తరగతులు ప్రారంభించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనం చుట్టూ ప్రహరీ, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.


పుట్నూర్ గ్రామ శివారులో నిరుపయోగంగా ఉన్న కేజీబీవీ భవనం



ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారులకు సన్మానం


ఉద్యోగ విరమణ పొందుతున్న వారిని సన్మానిస్తున్న అధికారులు

రామగిరి, జూలై 23: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారులకు మంగళవారం సన్మానించారు. ఈనెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న కార్పొరేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్ గురువయ్య, ఎన్విరాల్‌మెంట్ జీఎం గురువయ్యలను జీఎం చాంబర్‌లో ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం హెచ్ఎన్ గుప్తా, రెస్క్యూ జీఎం శ్రీనివాస్ రెడ్డి, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, అధికారులు రఘుపతి, రాజేందర్, రమేష్, మధుసూధన్, శేఖరబాబు, చంద్రశేఖర్, కర్ణ, రాజారెడ్డి, రవీందర్‌రెడ్డి, కాశీవిశ్వేశ్వర్‌రావు, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసిన బీఆర్ఎస్


గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న ధర్మపురి

రామగిరి, జూలై 23: సింగరేణి సంస్థను, ఆర్థిక వ్యవస్థను రాష్ట్రంలో బీఆర్ఎస్, సింగరేణిలో టీబీజీకేఎస్ పది సంవత్సరాలు విచ్ఛిన్నం చేశాయని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ చీఫ్ వైస్‌ప్రెసిడెంట్ ధర్మపురి ఆరోపించారు. మంగళవారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ కార్మికుల సంక్షేమంపైనే ప్రధానంగా దృష్టి సారించిందన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెంచి కార్మికులను ఇబ్బందులపాలు చేశారని ఆరోపించారు. ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొట రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు పడుతున్న ఇబ్బందులపై మేనేజ్‌మెంట్ దృష్టికి తిసికెళ్ళినట్లు తెలిపారు. తిరుపతి, దాసు, సమ్మయ్య, మనోహర్, కెఎన్ చారి, సందెల కుమార్, రాజకుమార్, రమేష్, అబ్దుల్‌ఖాసీం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు సిబ్బందికి రూ.30 లక్షల ప్రమాద బీమా

- హెచ్‌డీఎఫ్‌సీ ద్వారా సౌకర్యం - కొత్తగూడెం, ఎస్‌టీపీల్లో ఈఎస్ఐ ఆసుపత్రుల ఏర్పాటు - సీఎండీ బలరాం

గోదావరిఖని, జూలై 23: సింగరేణిలో పని చేస్తున్న 25వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే విధంగా రూ.30లక్షల ఉచిత ప్రమాద బీమా సదుపాయాన్ని వర్తింప చేస్తున్నట్టు సింగరేణి సీఎండీ బలరాంనాయక్ ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి సింగరేణి అన్నీ ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక సమీక్షను సీఎండీ నిర్వహించారు. అయితే కాంట్రాక్టు కార్మికులందరూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో సాలరీ అకౌంట్ కలిగి ఉండాలనే నిబంధనను పెట్టారు. ఈ విషయాల్లో ఏరియాల జీఎంలు సంబంధిత కాంట్రాక్టర్ల ద్వారా కార్మికులకు అవగాహన కల్పించాలని బలరాంనాయక్ సూచన చేశారు. ఇప్పటికే సింగరేణి పర్మినెంట్ కార్మికులకు యూనియన్ బ్యాంకు ద్వారా రూ.కోటి ప్రమాద బీమా పథకాన్ని ఈ మధ్యేప్రారంభించిన అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. అలాగే కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో ఒప్పందం చేసుకుని రూ.30లక్షల ప్రమాద బీమా కాంట్రాక్టు కార్మికులకు వర్తించేలా కృషి జరిగిందని చెప్పారు. ఇతర ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా రూ.50లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కాంట్రాక్టు ఉద్యోగులకు వర్తింప చేసేందుకు కూడా ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబ సభ్యుల సామాజిక, ఆర్థిక భద్రత చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఎండీ అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు సింగరేణి ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్నామని, వారి కుటుంబ సభ్యులు, పిల్లలకు కూడా ఆరోగ్య సేవలు అందించేందుకు ఈఎస్ఐ ఆసుపత్రుల ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుగుతున్నట్టు బలరాం జీఎంలకు వివరించారు. మొదటి విడుతగా కొత్తగూడెంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎస్‌టీపీ)లలో ఈఎస్ఐ ఆసుపత్రులకు కాంట్రాక్టు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

కార్మిక చట్టాలు, కోర్టు దిశా నిర్దేశాల ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులందరికి తప్పనిసరిగా పీఎఫ్, సీఎం పీఎఫ్, పెన్షన్ కోసం జీతంలో కొంత రికవరీ చేసి కాంట్రాక్టర్ ద్వారా అంతే మొత్తాన్ని జమ చేసి కార్మికుల ఖాతాల్లో వేయాల్సి ఉంటుందని, ఇది తప్పనిసరిగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఎండీ ఈ సమీక్షలో జీఎంలకు ఆదేశించారు. వీటన్నింటి అమలు కోసం కార్మికుల మస్టర్లను వెబ్ అప్లికేషన్ ద్వారా నమోదు చేసే ప్రక్రియను చేపట్టాల్సిన అవసరం ఉందని, ఆగస్టు మొదటి వారం నుంచే ఈ ప్రక్రియను అమలులోకి తీసుకువస్తున్నట్టు సీఎండీ వివరించారు. వీటి వల్ల మస్టర్ల నమోదు ఆధారంగా జీతాలు, పీఎఫ్, సీఎంపీఎఫ్ చెల్లింపులు సక్రమంగా జరిగి కార్మికుల ఖాతాల్లో జమ చేసే వీలు ఉంటుందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో కొత్తగూడెం నుంచి డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్‌తో పాటు కార్పొరేట్ జీఎంలు జీ వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం(కో ఆర్డినేటర్) దేవేందర్, అన్నీ ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య


బీఎంఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖని, జూలై 23: భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం బొగ్గు గనులపై ఘనంగా నిర్వహించారు. ఆర్‌జీ-1 ఏరియా జీడీకే2, ఓసీపీ-5, ఏరియా వర్క్‌షాప్, స్థానిక బీఎంఎస్ కేంద్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన అనంతరం యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ దేశం కోసం పనిచేస్తామని, తగిన వేతనం సాధిస్తాం అనే నినాదం బీఎంఎస్ సొంతమన్నారు. కార్మికులలో దేశం పట్ల అంకితభావం ఉన్నప్పుడు వారిలో దేశభక్తి నిర్మాణం అవుతుందని, దేశం నిలిస్తే కార్మికులు నిలుస్తారని, అందుకే కార్మికులలో దేశభక్తిని నింపి, వారిలో జాతీయతా భావాన్ని పెంపొందించి తద్వారా దేశానికి కార్మిక రంగంలో సేవలు అందించే విధంగా చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో బీఎంఎస్ ఏరియా కేంద్ర ట్రెజరర్ ఆకుల హరిణ్, ఉపాధ్యక్షులు కర్రావుల మహేష్, ఏరియా కార్యదర్శి సాయవేణి సతీష్, పిట్ కార్యదర్శులు పల్లె శ్రీనివాస్, తాట్ల లక్ష్మయ్య, పెంచాల వెంకటస్వామి, తుమ్మ గట్టయ్య, పోతరాజు భాస్కర్, చెన్న సతీష్, పూసాల నాగేంద్రప్రసాద్, సంగాని సాంబయ్య, ఎల్లావుల కోటయ్య, జీ నరసింహులు, మేడ రాంమూర్తి, సీహెచ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 23: బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఆర్జీ-2 పరిధిలోని ఓసీపీ-3, ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1 ప్రాజెక్టుల్లో ఘనంగా నిర్వహించారు. ఓసీపీ-3 కృషిభవన్‌లో యూనియన్ ఆర్జీ-2 వైస్‌ప్రెసిడెంట్ వడ్డెపల్లి కుమారస్వామి యూనియన్ జండాను ఎగురవేయగా, ఓసీపీ-1 సైటాఫీస్‌లో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్‌రావు బీఎంఎస్ జండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కోటికిపైగా సభ్యత్వంలో దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా బీఎంఎస్ పనిచేస్తున్నట్టు పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా కార్మికుల పక్షాన నిలిచే సంఘంగా బీఎంఎస్ పేరు గడించినట్టు తెలిపారు. కార్మిక సంఘాలు నిర్వీర్యం అవుతున్న సింగరేణిలో బీఎంఎస్ మాత్రమే సమర్థవంతమైన యూనియన్‌గా నిలబడుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగిందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సైతం అదే ధోరణిలో నడుచుకుంటున్నట్టు పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు, యాజమాన్య వైఫల్యాలను ప్రశ్నించడంలో గెలిచిన రెండు సంఘాలు విఫలమైనట్టు కుమారస్వామి, వేణుగోపాల్‌రావులు పేర్కొన్నారు. అరుకుల ప్రసాద్, రాజమహేందర్‌రెడ్డి, ప్రమోద్‌కౌషల్, మాదాపు రవీందర్, రౌతు రమేష్, మర్రి సంతోష్, సురేష్, మామిడి స్వామి, కృష్ణ, గట్టు శ్రీనివాస్, రాజేష్, రవి, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన పైడిపాటి బాబీవర్మ

మంథని, జూలై 23: బూటాన్ దేశంలో ఈనెల 18 నుంచి 22 వరకు జరిగిన సౌత్ఏషియన్‌కరాటే చాంపియన్‌షిప్‌లో మంథని జేకేఏ షోటోకాన్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన పైడిపాటి బాబీవర్మ గోల్డ్‌మెడల్ సాధించినట్లు ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు మంగళవారం వెల్లడించారు. బాబీవర్మ ఆగస్టు 23 నుంచి 25 వరకు ఫిలిపిన్స్ దేశంలో జరిగే ఏషియా కరాటే చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. బేబీవర్మని తెలంగాణ కరాటే ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్, ఇండియా కోచ్ కొండ్రు కీర్తన్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా కరాటే మాస్టర్స్ ప్రత్యేకంగా అభినందించారు.

బాల గంగాధర్ తిలక్ జయంతి

కళ్యాణ్‌నగర్, జూలై 23: స్వరాజ్యమే నా జన్మహక్కు అని నినదించి స్వాతంత్ర్య సమరంలో బాల గంగాధర్ తిలక్ తన జీవితం ధారపోశారని హిందూ ఉత్సవ సమితి కన్వీనర్ పైతరి రాజు అన్నారు. బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా తిలక్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వం బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించకపోవడాన్ని హిందూ ఉత్సవ సమితి తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అయోధ్య రవీందర్, సాయి, భాస్కర్, దిగంబర్ అజయ్, నవీన్, చింతల ఉమ, నరేష్, సోను, నివాస్, భరత్, ఆంజనేయులు, అరుణ్ పాల్గొన్నారు.

ధర్మారం ఏఎస్సైకి పదోన్నతి

ధర్మారం, జూలై 23: ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్ ఎస్సైగా పదోన్నతి పొందారు. ఈ మేరకు వేణుగోపాల్‌కు రామగుండం సీపీ శ్రీనివాస్ ఎస్సై చిహ్నంను అందించారు. గతంలో మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్, సుల్తానాబాద్, ప్రస్తుతం ధర్మారంలో ఏఎస్సైగా వేణుగోపాల్ విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సైగా పదోన్నతి పొందడం పట్ల ధర్మారం ఎస్సై లక్ష్మణ్‌తో పాటు పలువురు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్. స్వామి

పాలకుర్తి, జూలై 23 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్.స్వామి అన్నారు. మంగళవారం మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో పోలీస్ కళాబృందం సైబర్ క్రైం, డయల్ 100, గంజాయిపై కళాకారులతో కళాజాతా నిర్వహించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్.స్వామి మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలకు యువత అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, దీంతో ఆ మత్తులో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. అనుమానస్పద వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్, వాట్సాప్ మేసేజ్ వస్తే రిప్లై ఇవ్వద్దన్నారు. గ్రామంలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సంబంధిత పోలీస్ అధికారులకు, లేకుంటే డయల్ 100కి కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

షీ టీమ్‌పై అవగాహన

కోల్‌సిటీటౌన్, జూలై 23: గోదావరిఖని సింగరేణి సెక్టార్-2 హైస్కూల్‌లో మంగళవారం జిల్లా షీటీం ఇంచార్జి ఆధ్వర్యంలో షీటీమ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి సురేష్, స్నేహలతలు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థుల రక్షణ కోసం షీటీమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళతున్నప్పుడు, ఏదైనా పని మీద బయటకు వెళ్లినపుడు ఆకతాయిలు ఇబ్బంది పెడితే షీటీం వాట్సాప్ నంబర్ 6303923700కు వెంటనే తెలియజేయాలని తెలిపారు. అలాగే సైబర్ నేరాలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శులు

జూలపల్లి, జులై 23. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. ఆయా గ్రామాలకు నూతనంగా పంచాయతీ కార్యదర్శులను నియమించడంతో వారు మండల పరిసత్ కార్యాలయంలో రిపోర్టుచేసి వారికి కేటాయించిన గ్రామపంచాయతీల్లో బాధ్యతలు చేపట్టినట్లు ఎంపిడిఓ పద్మజ తెలిపారు. మండలంలోని అబ్బాపూర్ పంచాయతీ కార్యదర్శిగా సయ్యద్ మోహిమిన్, బాల్‌రాజ్‌పల్లి పిల్లలమర్రి విజయకుమార్, చీమలపేట వేములు ప్రవీన్‌కుమార్, జూలపల్లి ఖాజముజీబుద్దిన్, కాచాపూర్ కొర్ర రేవంతి, కీచులాటపల్లి జె బానుప్రసాద్, కోనరావుపేట్ అటికేటి శ్రీకాంత్, కుమ్మరికుంటా సింగిరెడ్డి మోహన్, నాగులపల్లి ఉమాపతిరెడ్డి, పెద్దాపూర్ తీగల సతీష్‌కుమార్, తెలుకుంట గడ్డం సతీష్, వెంకట్రావుపల్లి నేరేడుగొమ్మ సాగర్‌రావు, వడుకాపూర్ విజయ అజ్మీరలు బాధ్యతలు చేపట్టినట్లు ఎంపిడిఓ పద్మజ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మంథనిరూరల్, జూలై 23: మండలంలోని ఉప్పట్ల గ్రామంలో ఎరుకల నాగరాజుకు చెందిన ఎద్దు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి ప్రమాదవశాత్తు విదుదాఘాతంతో మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం మంగళవారం.. మధ్యాహ్నం మేతకు వెళ్లిన ఎద్దులు సమీపంలోని కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకాయి. దీంతో ఎద్దు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడనే మృత్యువాత పడింది. చనిపోయిన ఎద్దు విలువ సుమారు 70 వేలు ఉంటుందన్నారు. వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో దుక్కి దున్నే ఎద్దు మృతి చెందడం రైతుకు నష్టం జరిగింది, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల

● పట్టించుకోని అధికారులు


శిథిలావస్థలో ఉన్న రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాల భవనం

పెద్దపల్లి రూరల్, జూలై 23 : పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలోని రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరినా పట్టించుకునే వారే కరువయ్యారు. పాఠశాలలో ఒకటి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులకు పాఠాలు భోధిస్తున్న తరగతి గది పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులను పంపించేందుకు తల్లిదండ్రులు మొగ్గుచూపడం లేదు. మధ్యాహ్న భోజనం వంట చేసే గది పూర్తిగా పగుళ్లు చూపడంతో పాటు వర్షాపు నీరు పడుతోంది. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో పూర్తిగా పిచ్చిమొక్కలు పెరిగాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని రాజేంద్రనగర్ కాలనీవాసులు కోరుతున్నారు.